- ఖమ్మం ఏఎంసీలో జెండాపాటను అడ్డుకొని ఆందోళన
- దిగొచ్చి మిర్చి ధరను సవరించిన మార్కెట్ అధికారులు

## 'సిండికేట్' మోసంపై రైతు సంఘం ధర్నా



ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ అనుబంధ రైతు సంఘం నాయకులు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 3 : మిర్చి ఖరీదుదారులు సిండికేట్‌గా మారి రైతులకు ఆశించిన ధర రాకుండా మోసానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ సీపీఐ అనుబంధ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. వ్యాపారుల వైఖరిని నిరసిస్తూ మిర్చి యార్డులో జెండాపాటను అడ్డుకున్నారు. ఆందోళన నేపథ్యంలో కొద్దిసేపటి తర్వాత అధికారులు తిరిగి జెండాపాట నిర్వహించారు. తొలుత జెండాపాట క్వింటా ధర రూ.13 వేలుగా నిర్ణయించగా.. రైతు సంఘం ఆందోళన నేపథ్యంలో జెండాపాటను క్వింటా ధర రూ.14,200గా నిర్ణయించి అమలు చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంత రావు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి తమ పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకొచ్చిన రైతులకు వ్యాపారులు సిండికేట్‌గా మారి ఆశించిన ధర రాకుండా చేస్తున్నారని మండిపడ్డారు. మిర్చి యార్డులో వ్యాపారులు, ఉద్యోగులు కలిసి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని, ధర రాకుండా వ్యాపారులు అడ్డుకుంటుంటే.. దానిని అడ్డుకోవాల్సిన ఉద్యోగులు వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ రమేశ్‌లతో వారు సమావేశమై రైతుల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మహ్మద్ మౌలానా, జితేందర్ రెడ్డి, యర్రా బాబు, ఎస్కే జానీమియా, దొండపాటి రమేశ్, గోవిందరావు, పోటు కళావతి, వెంకటరెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, మల్లేశ్, పుచ్చకాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిఘా నీడలోనే.. ఇంటర్ పరీక్షలు

**విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైన ఇంటర్మీడియట్ పరీక్షలు సీసీ కెమెరాల నడుమ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ఏడాది పరీక్షలు జరిగే అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. అయితే నిఘా నీడలో పరీక్షలు నిర్వహించడాన్ని తొలుత ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. కానీ.. ప్రభుత్వంతో జరిపిన చర్చల అనంతరం అంగీకారం తెలిపాయి. భద్రాద్రి జిల్లాలో 102 కళాశాలలుండగా.. 19,271 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మార్చి 5 నుంచి పబ్లిక్ పరీక్షలు జరుగనుండగా.. ఈ నెల 3 (సోమవారం) నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి.**

**– భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ)**

- తొలుత అభ్యంతరం చెప్పిన ప్రైవేటు జూనియర్ కాలేజీలు
- ప్రభుత్వ చర్చల అనంతరం సీసీ కెమెరాలకు అంగీకారం
- లైవ్ కాస్టింగ్‌కు సడలింపు ఇచ్చిన ఇంటర్మీడియట్ బోర్డు
- 'భద్రాద్రి'లోని 102 కాలేజీల్లో వచ్చే నెల 5 నుంచి ఎగ్జామ్స్
- 19,271 మంది విద్యార్థులు.. ఈ నెల 22 వరకూ ప్రయోగాలు



దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఫైల్)



సీసీ కెమెరాల నిఘాలోనే పరీక్షలు నిర్వహించాలంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ప్రైవేటు కాలేజీల యజమానులు తొలుత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలిసీ తెలియక విద్యార్థులు చేసే పొరపాట్ల వల్ల వారు చిక్కుల్లో పడతారని, వారి భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందని, అలాగే తమకూ ఖర్చుతో కూడుకొని ఉంటుందని కారణాలు చెప్పారు. మొత్తానికి ప్రభుత్వం కూడా వారి వినతిని పరిగణనలోకి తీసుకుంది. అయితే, ఒక నెల గడువులో అన్ని కాలేజీల గదుల్లో సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలంటే సాధ్యం కాదని వారు అభ్యంతరం చెప్పారు. కొంత సమయం పడుతుందని అంటున్నారు. జిల్లాలో 102 జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వ కాలేజీలు కేవలం 14 మాత్రమే ఉన్నాయి. 32 ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. ప్రభుత్వంలో బీసీ కాలేజీలు 9, మైనార్టీ కాలేజీలు 9, కేజీబీవీలు 14, ఎస్సీ సంక్షేమ కాలేజీలు 16, ఎస్టీ సంక్షేమ కాలేజీలు 8 ఉన్నాయి.

### వచ్చే నెల 5 నుంచి పరీక్షలు..

ఇంటర్మీడియట్ బోర్డు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో ఇంటర్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఇందులో భాగంగా భద్రాద్రి జిల్లాలో 102 కాలేజీల్లో మార్చి 5 నుంచి 22 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతోపాటు ఈ నెల 3న ప్రారంభమైన ప్రాక్టికల్స్ 22 వరకు జరుగనున్నాయి.

### 'భద్రాద్రి'లో 19,271 మంది విద్యార్థులు

ఇంటర్ పరీక్షలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 19,271 మంది విద్యార్థులు ఇప్పటికే ఫీజులు చెల్లించి పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రాక్టికల్స్ కోసం 54 కేంద్రాలు, ఒకేషనల్ ప్రాక్టికల్స్ కోసం 11 కేంద్రాలు, థియరీ పరీక్షల కోసం 36 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఐడీవోసీలోని ఇంటర్మీడియట్ ఆఫీసులో స్క్వాడ్ అధికారులతో ఇంటర్మీడియట్ అధికారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పరీక్షల పరిశీలన కోసం టేకులపల్లి కాలేజీ ప్రిన్సిపాల్ సులోచనారాణి, అశ్వారావుపేట కాలేజీ అధ్యాపకులు అరవింద్‌బాబులను నియమించారు.

### అన్ని కాలేజీల్లో సీసీ కెమెరాలు ఉండాల్సిందే..



ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ కాలేజీల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే, సీసీ కెమెరాల ఏర్పాటుకు తొలుత ప్రైవేటు కాలేజీ యూనియన్ బాధ్యులు అభ్యంతరం తెలిపారు. కానీ.. ఆయా నిబంధనలను ఇంటర్ బోర్డు పరిశీలించి కొంత సడలించినట్లు తెలిసింది. థియరీ పరీక్షలు మాత్రం సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే జరుగుతాయి. లైవ్ వెబ్‌కాస్టింగ్‌కు కొంత వెసులుబాటు ఇచ్చినట్లు తెలిసింది. కానీ.. ఇంతవరకు అధికారికంగా మాకు ఎలాంటి ఆదేశాలు అందలేదు.

**–హెచ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, భద్రాద్రి**

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి: ఆర్జేసీ కృష్ణ



మాట్లాడుతున్న బీసీ సంఘం సీనియర్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ

ఖమ్మం, ఫిబ్రవరి 3 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని బీసీ సంఘం సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన బీసీ కులస్తుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన కులగణనలో బీసీలు 56శాతం పైగా ఉన్నారని, గతంలో మాట ఇచ్చిన ప్రకారం 42శాతం రిజర్వేషన్ ఇచ్చి ఎన్నికలు జరపాలని కోరారు. అనంతరం కూరాకుల నాగభూషణం మాట్లాడుతూ ఈ సమాజంలో ఇంకా బీసీల పట్ల వివక్ష కొనసాగుతున్నదని, కులగణన, కులాల నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు. బొమ్మా రాజేశ్వరరావు మాట్లాడుతూ బీసీల పట్ల చిన్నచూపు తగదని, అన్ని పార్టీలు బీసీలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. బీసీ నాయకులు కత్తి నెహ్రూ మాట్లాడుతూ 13శాతం ఉన్న అగ్ర కులాల్లో ఆర్థికంగా వెనకబడిన వారికి 10శాతం రిజర్వేషన్ ఇవ్వడం దారుణమని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను తొలగించాలని కోరారు. కూరపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఖమ్మంలో బీసీ గర్జన దిశగా అన్ని బీసీ సంఘాలను సంసిద్ధత చేయాలని కోరారు. అనంతరం నాయకులందరూ అన్ని పార్టీలను కుల సంఘాలను పిలిచి 42శాతం రిజర్వేషన్ సాధించేందుకు విస్తృతస్థాయిలో రౌండ్‌టేబుల్ సమావేశం జరపాలని, అనంతరం వివిధ కుల సంఘాలతో సమావేశం జరపాలని నిర్ణయించారు.






- ఖమ్మం జిల్లాలో మారని ప్రయోగ పరీక్షల నిర్వహణ తీరు
- విద్యార్థులను గుంపులుగుంపులుగా కూర్చోబెట్టి పరీక్షలు
- స్లిప్ టెస్టులకంటే తీసికట్టుగా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్
- కేంద్రాలను తనిఖీ చేసిన డీఐఈవో, ఫ్లయింగ్ స్క్వాడ్స్

## కారిడార్‌లో కెమెరాలు.. ల్యాబ్‌లో ప్రాక్టికల్స్..



ఖమ్మంలో ప్రాక్టికల్స్ తీరును పరిశీలిస్తున్న డీఐఈవో రవిబాబు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 3: ఒక్క ప్రయోగం.. వంద సార్లు చేసిన రివిజన్‌తో సమానం. విద్యార్థులకు పాఠాలను సులభతరం చేసేందుకు సంకల్పించిన విద్యాశాఖ.. ప్రయోగాలను వారి పాఠ్యాంశాల్లో భాగంగా చేర్చింది. కానీ.. విద్యార్థుల మేధాశక్తిని పెంచేందుకు నిర్వహించాల్సిన రోజువారీ ప్రాక్టికల్స్ కళాశాలల్లో నిర్వహించలేదు. ఇప్పుడు ఆ ప్రభావం పడకుండా విద్యార్థులను తప్పుడు పద్ధతుల్లో ప్రోత్సహిస్తున్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన ప్రాక్టికల్స్‌లో ఏ మాత్రమూ నిబంధనలను పాటించలేదు. 'ఇవి ప్రయోగ పరీక్షలేనా?' అని సందేహించేలా కొన్ని కళాశాలల్లో నిర్వహణ సాగుతోంది. రోజువారీగా రాసే స్లిప్ టెస్టుల కంటే తీసికట్టుగా విద్యార్థులను గుంపులు గుంపులుగా కూర్చోబెట్టి ప్రాక్టికల్ పరీక్షలు రాయిస్తున్నారు.

### ల్యాబ్‌లో ఉండాల్సిన కెమెరాలు కారిడార్‌లో..

ప్రాక్టికల్స్ నిర్వహించే ల్యాబ్‌లో సీసీ కెమెరాలు అమర్చాలని నిబంధనలు చెబుతుంటే.. కొన్ని ప్రైవేట్ కళాశాలలు మాత్రం వాటిని కారిడార్‌లో అమర్చడం గమనార్హం. తొలిసారి డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ లేకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రాక్టికల్స్ జరగాల్సి ఉంది. కానీ.. కొన్ని ప్రైవేటు కాలేజీలు మాత్రం ఆ సీసీ కెమెరాలను ప్రయోగశాలల్లో అమర్చలేదు. కేవలం కాలేజీ కారిడార్‌లో అమర్చాయి. దీంతో ప్రాక్టికల్స్ నిర్వహణకు నియమించిన అధికారులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. విద్యార్థులందరూ ఒకే దగ్గర కూర్చొని ప్రయోగ పరీక్షలు రాస్తున్న తీరును చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, తమ విద్యార్థుల ఫస్టియర్ మార్కుల ఆధారంగా ప్రాక్టికల్స్‌లో మార్కులు కేటాయించాలంటూ ప్రయోగ పరీక్షల అధికారులను ప్రైవేటు కాలేజీలు కోరడం గమనార్హం. ఇదే విషయం గురించి ప్రాక్టికల్స్ విధులు నిర్వహిస్తున్న అధికారులు ఒకరికొకరు చర్చించుకుంటున్నారు. అయితే, వీరి మర్యాదలకు ఎక్కడా లోటులేకుండా నిర్వాహకులు చూసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇక నుంచి జరిగే పరీక్షలకైనా అధికారులు స్పందించి పటిష్ట చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.

### తొలిరోజు 301 మంది గైర్హాజరు..

ఖమ్మం జిల్లాలో సోమవారం ఉదయం సెషన్‌లో జనరల్ 35, ఒకేషనల్ 7 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ జరిగాయి. 3,117 మంది విద్యార్థులకుగాను.. 2,912 మంది హాజరయ్యారు. 205 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో జనరల్ 29, ఒకేషనల్‌లో 7 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ జరిగాయి. 2,674 మంది విద్యార్థులకుగాను.. 2,578 మంది విద్యార్థులు హాజరయ్యారు. 96 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్లలో కలిపి మొత్తం 301 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో రవిబాబు తెలిపారు. హైపవర్ కమిటీ, డెక్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల అధికారులు ఉదయం 18 కేంద్రాలను, మధ్యాహ్నం 14 కేంద్రాలను తనిఖీ చేసినట్లు డీఐఈవో వివరించారు.

## ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి: డీఆర్వో



మాట్లాడుతున్న ఖమ్మం డీఆర్వో పద్మజ

మామిళ్లగూడెం, జనవరి 3: ఖమ్మం జిల్లాలో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో పద్మజ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. మార్చి 5 నుంచి 25 వరకు జిల్లాలో జరిగే ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయని తెలిపారు. సోమవారం మొదలైన ప్రాక్టికల్స్ ఈ నెల 22 వరకు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే 36,660 మంది విద్యార్థులకు 72 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. డీఐఈవో రవిబాబు, ఇతర శాఖల జిల్లా అధికారులు కళావతిబాయి, నారాయణ, దినేశ్‌కుమార్ విజయలక్ష్మి, వెంకటరామయ్య, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.






# 'సర్వే'లో సమగ్రత డొల్ల

- 'బీసీల కులగణన', 'ఇంటింటి సర్వే'లో పారదర్శకతకు పాతర
- గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 56 శాతంగా బీసీల జనాభా
- తాజా కాంగ్రెస్ సర్కారు కులగణనలో కేవలం 46 శాతమేనని వెల్లడి
- భగ్గుమంటున్న బీసీలు.. పోరాటం తప్పదంటున్న సంఘాల నేతలు

**రాష్ట్రంలో బీసీల జనాభా 46 శాతమేనంటూ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వంపై బీసీ వర్గాల ప్రజలు, ఆ సంఘాలు నాయకులు భగ్గుమంటున్నారు. గత నవంబర్‌లో చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేను పూర్తిస్థాయిలో జరపకుండానే ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను ప్రకటించడంపై మండిపడుతున్నారు. బీసీలను అణగదొక్కడం కోసం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తక్కువ సీట్లు కేటాయించడం కోసమే ఈ అసమగ్ర కులగణన సర్వేను ప్రభుత్వం విడుదల చేసిందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలు 56 శాతంగా ఉన్నట్లు తేలిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. మరి కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా చేసిన ఇంటింటి కులగణన సర్వేలో బీసీలు ఏకంగా 10 శాతం తగ్గి 46 శాతానికే ఎలా పరిమితమవుతారని ప్రశ్నిస్తున్నారు. పైగా అంతకుముందు 6 శాతంగా ఉన్న ఓసీలు ఇప్పుడు 15 శాతం ఎలా పెరుగుతారంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటి సర్వేలో సమగ్రత డొల్లలా ఉందని విమర్శిస్తున్నారు. సర్వేలో పారదర్శకతకు ప్రభుత్వం పాతరేసిందని దుయ్యబడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సర్వే నివేదిక అంతా తప్పల తడకగా ఉందని తూర్పారబడుతున్నారు. ఎన్నికల్లో లబ్ధికోసమే హడావిడిగా సర్వే చేసి బీసీలను మోసం చేస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సోమవారం బీఆర్ఎస్ సహా పలు పార్టీల నేతలు, బీసీ సంఘాల నాయకులు 'నమస్తే తెలంగాణ'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు.**

–ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, ఫిబ్రవరి 3

### బీసీలను విస్మరిస్తే ఉద్యమం చేపడతాం..



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బీసీ కులగణన సర్వే నివేదిక తప్పుల తడకగా ఉంది. ఎన్నికల కోసమే ఈ తప్పుడు నివేదికను ప్రకటించింది. బీసీలను మోసం చేయాలన్న కుట్ర స్పష్టంగా కన్పిస్తోంది. రాష్ట్రంలో బీసీలు 60 శాతానికి పైగానే ఉన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువగా చూపింది. పైగా ఈ కులగణన పేరుతో ఏడాదిపాటు కాలయాపన చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటికిప్పుడు హడావిడి చేస్తోంది. అదీగాక బీసీ కులాల మధ్య కొట్లాటలు పెట్టే విధంగా వ్యవహరిస్తోంది. బీసీలను విస్మరిస్తే ఉద్యమం చేపడుతాం.

**–పగడాల నాగరాజు, బీసీ నాయకుడు, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు**

### తప్పుడు సర్వేలతో బీసీలు నష్టపోతారు..



తప్పుడు సర్వేలతో బీసీలు నష్టపోతారు. అసలు బీసీల జనాభా ఎంత శాతం అనే విషయాన్ని కులగణన ద్వారా వెల్లడించాలి. ఆ నివేదిక సమగ్రంగా ఉండాలి. కానీ తాజాగా ప్రభుత్వం వెల్లడించిన కులగణన సర్వే సమగ్రంగా ఉన్నట్లు కన్పించడం లేదు. కులగణన సర్వే పూర్తిస్థాయిలో జరిగితేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. రాష్ట్రంలో బీసీల జనాభా శాతం అత్యధికంగా ఉంది. ప్రభుత్వం మరోసారి సర్వే నిర్వహించి కచ్చితమైన గణాంకాలు ప్రకటించాలి.

**–బొమ్మా రాజేశ్వరరావు, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు, ఖమ్మం**

### బీసీ కులగణన లెక్కలపై అనుమానాలున్నాయి..



బీసీల జనాభా, కులగణనపై ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నివేదికపై అనేక అనుమానాలు ఉన్నాయి. గ్రామ, మండల స్థాయిల్లో కులగణన సమగ్రంగా జరగలేదు. అందుకని ఇక్కడే అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బీసీ సంఘాల ప్రమేయం లేకుండా, వారి అభిప్రాయాలు తీసుకోకుండా కులగణన చేయడం సరికాదు. బీసీ సంఘాలను ప్రభుత్వం దూరం పెడుతుండడం కూడా సందేహాలకు తావిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధికోసమే బీసీ కులగణన సర్వే చేపట్టింది. బీసీ కులగణన సర్వేపైనా, బీసీలకు న్యాయం చేసే అంశంపైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు.

**–సత్తి నాగేశ్వరరావు, బీసీ సంఘం నాయకుడు,చంద్రుగొండ**

### బీసీలకు అన్యాయం చేసేందుకే..



రాష్ట్రంలో అత్యధిక శాతంగా ఉన్న బీసీలకు అన్యాయం చేసేందుకు కులగణన సర్వే నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుగా వెల్లడించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు మొండిచేయి చూపించాలనే ఉద్దేశం ఈ సర్వేలో పక్కాగా కనిపిస్తోంది. సర్వేలో కొన్ని ఇళ్లను మాత్రమే గుర్తించారు. సర్వే కోసం ఇంటింటికి వచ్చిన సిబ్బంది.. అనేక గ్రామాల్లో చాలా ఇళ్లను వదిలేసి వెళ్లారు. ఆయా ఇళ్లను సందర్శించి సర్వేను చేపట్టలేదు. పూర్తిస్థాయిలో చేయని సర్వే సమగ్ర సర్వే ఎలా అవుతుంది? సామాజిక కుల సర్వే చేపట్టి కచ్చితమైన నివేదికను వెల్లడించాలి.

**–కూరాకుల నాగభూషణం, బీసీ నాయకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్**

### బీసీలను విభజించారు..



2011 జనాభా లెక్కల ప్రకారం కులగణన చేసి బీసీల రిజర్వేషన్లు తగ్గించారు. బీసీల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ ముస్లిలను, బీసీలను విభజించి బీసీ కోటాను తగ్గించే ప్రయత్నం చేశారు. తాజా కులగణన సర్వే నివేదికలో ఇదే విషయం స్పష్టమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సీట్లు ఇవ్వకూడదనే దురుద్దేశంతోనే రిజర్వేషన్లను తగ్గించేందుకు ప్రభుత్వం పూనుకుంటోంది. ఇది చాలా దారుణం. ఈ సర్వే కూడా నిజమైన సర్వే కాదు. ఇంటివద్ద కూర్చొని తప్పుడు లెక్కల ద్వారా నివేదిక ఇచ్చారు. మళ్లీ సర్వే చేయాలి.

**–అంకినీడు ప్రసాద్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు, భద్రాద్రి జిల్లా**

### బీసీగణన తప్పులతడక..



బీసీల కులగణనను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పులతడకగా నిర్వహించింది. అనేక ప్రాంతాల్లో అసలు సర్వేను సక్రమంగా చేపట్టలేదు. సర్వేకు వచ్చిన ఎన్యూమరేటర్లు అరకొరగా సమాచారాన్ని సేకరించారు. ప్రభుత్వం ముందస్తుగానే కులం వివరాలు చెప్పకపోయినా ఫర్వాలేదని అన్నది. దీంతో అనేక ప్రాంతాల్లో ప్రజలు కులం వివరాలను వెల్లడించలేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం సర్వే పూర్తి చేసినట్లు చెబుతోంది. అందులోని వివరాలన్నీ తప్పులమయంగా ఉన్నాయి. మరోసారి సర్వే నిర్వహించి పూర్తిస్థాయిలో బీసీల వివరాలు సేకరించాలి.

**–గుండాల కృష్ణ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ఖమ్మం**

### బీసీ గణనలో తప్పుడు లెక్కలు



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కుల గణనలో తప్పుడు లెక్కలు ఉన్నట్లు స్పష్టంగా కన్పిస్తోంది. రాష్ట్రంలో అధిక శాతం ఉన్న బీసీలను తక్కువ సంఖ్యలో చూపించడమే ఇందుకు నిదర్శనం. బీసీలను మభ్యపెట్టేందుకే నిజమైన సంఖ్య కంటే తక్కువ సంఖ్యను చూపిస్తోంది. ఇలా చేస్తే బీసీలకు ముమ్మాటికీ అన్యాయం చేసినట్లే అవుతుంది. తెలంగాణ రాష్ట్రంలో ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. బీసీలకు న్యాయం చేస్తామని గొప్పలు చెబుతూ బీసీ కులగణన చేసింది. కానీ ఈ సర్వేలో బీసీలను విభజించి తక్కువ చేసి చూపిస్తోంది. ఇలా చేయడమంటే బీసీలకు ద్రోహం చేయడమే. రానున్న కాలంలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి వస్తుందన్న దురుద్దేశంతోనే ఇలా కులగణన గణాంకాల్లో తప్పుడు లెక్కలు చూపిస్తోంది.

**–దిండిగాల రాజేందర్, బీసీ నాయకుడు, బీఆర్ఎస్ సీనియర్ నేత**


